క్లుప్తంగా

కలెక్టర్స్ క్రికెట్ ట్రోఫీకి ఎంపికలు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా కలెక్టర్స్ క్రికెట్ ట్రోఫీకి నియోజకవర్గ స్థాయిలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎస్.పల్లవి, చీఫ్ కోచ్ సీహెచ్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ స్థాయి ఎంపికలు ఈ నెల 27న ఉదయం 10 గంటలకు మండలంలోని నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయన్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో నరసరావుపేట డీఎస్ఏ స్టేడియంలో జిల్లా స్థాయి టోర్నమెంటు జరుగుతుందన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి లాకు పిచ్చయ్యను వివరాలకు 9000999557 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ముగిసిన ఎడ్ల బల ప్రదర్శన

అచ్చంపేట: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలలో భాగంగా టీడీపీ నేత వట్టికుంట శేషగిరి ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో ఆరుపళ్ల విభాగంలో విజేతలను శనివారం ప్రకటించారు. మొత్తం 14 జతల ఎడ్లు పాల్గొనగా మొదటి 9 జతలకు బహుమతులను అందజేశారు. వినుకొండకు చెందిన బత్తుల చిన్న బ్బాయి, గన్నవరానికి చెందిన కొలుసు శ్రీనివాసరావు, పెదకాకానికి చెందిన మోపర్తి శ్రీనివాసరావు, హుజూర్ నగర్‌కు చెందిన జక్కుల చిన వెంకటేశ్వర్లు యాదవ్, సత్తెనపల్లికి చెందిన చావలి అభిరామ్, కాదాడకు చెందిన కొప్పుల హేమలత శ్రీనివాసరావు, పెదకాకానికి చెందిన మందపాటి లింగయ్య చౌదరి, తుళ్లూరుకు చెందిన కె.ప్రభాకరరెడ్డి, అచ్చంపేటకు చెందిన చావల అభిరామ్ ఎడ్ల జతలు విజేతలుగా నిలచాయి. ఈ పోటీలు ఈ నెల 29వ రకు జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు క్రికెట్ పోటీలు

సత్తెనపల్లి: పట్టణంలోని శరబయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు న్యాయవాదులు, పోలీసుల మధ్య క్రికెట్ పోటీలు జరుగుతాయని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారురి లింగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

సీపీఎం నేత మన్నెం మృతి

నార్నెపాడు(ముప్పాళ్ళ): నార్నెపాడు గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు మన్నెం నాగేశ్వరరావు(70) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన మృత దేహాన్ని రైతు సంఘం జిల్లా నాయకుడు గుంటు పల్లి బాలకృష్ణ, సీపీఎం పార్టీ వ్యాసకర్త మన్నెంకోటేశ్వరరావు, కూరపాటి ప్రభాకర్, నూకారపు సాంబశివరావు, పి.మస్తాన్‌రావు, నాగేశ్వరరావు, ఇంజం శ్రీను సందర్శించి భౌతిక కాయంపై పార్టీ జెండా కప్పి, పూలమాలలు వేసి.. నివాళులర్పించారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

సత్తెనపల్లి: మహిళ అదృశ్యంపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదయ్యింది. వివరాలు మేరకు.. పట్టణంలోని 21వ వార్డు కొత్తపేటకు చెందిన చందా నాగరాజు, త్రివేణికి మూడు నెలల క్రితం వివాహం అయ్యింది. త్రివేణి ఓ ప్రైవేట్ వైద్యశాలలో నర్సుగా పనిచేస్తోంది. కాగా ఈ నెల 23న ఉదయం 10 గంటలకు వైద్యశాలకు అని వెళ్లిన త్రివేణి రాత్రి వరకు తిరిగి రాలేదు. భర్త నాగరాజు వైద్యశాలకు వెళ్లి విచారించగా.. వైద్యశాలకు రాలేదని సిబ్బంది చెప్పారు. దీంతో నాగరాజు చుట్టు పక్కల ప్రాంతాల్లో విచారించినప్పటికీ ప్రయోజనం లేక పోవడంతో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. నాగరాజు ఫిర్యాదు మేరకు.. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దళిత క్రైస్తవులపై సీఎం నిర్ణయం హర్షణీయం

సత్తెనపల్లి: దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఏపీ శాసనసభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీర్మానం చేయటంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు మహాజన దళిత సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దీపాల పరంధామయ్య అన్నారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. క్రైస్తవ మతం లో ఉన్న దళితులకు రిజర్వేషన్‌లు ఇవ్వమని కేంద్రం చెప్పడం సమానత్వానికి వ్యతరేకమన్నారు.

తల్లీబిడ్డకు సంపూర్ణ పోషణ

తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం తప్పనిసరి. ముఖ్యంగా పేద కుటుంబాల్లో పౌష్టికాహార లోపం స్పష్టం కనిపిస్తుంది. గర్భిణులు, బాలింతలు, ఆరేళ్ల లోపు చిన్నారులకు అంగన్ వాడీ కేంద్రాల్లో మధ్యాహ్నం మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వివిధ రకాల పదార్థాలతో పోషణ కిట్లు అందజేయడమే కాకుండా నెలకోసారి వైద్య పరీక్షలు చేసి, వారి ఆరోగ్యాన్ని సంరక్షిస్తోంది.

- అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు మధ్యాహ్న భోజనం
- ప్రతి నెలా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ

సత్తెనపల్లి: ప్రసవం అనంతరం తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారం అందిస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద గర్భిణులు, బాలింతలు, ఐదేళ్ల లోపు చిన్నారులకు రోజువారీ మెనూ ప్రకారం మధ్యాహ్నం పౌష్టికాహారం వండి వడ్డిస్తున్నారు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో 303 అంగన్‌వాడీ, రెండు మినీ అంగన్వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో గర్భిణులు 1,535, బాలింతలు 1,702, ఆరేళ్ల లోపు చిన్నారులు 20,335 మంది ఉన్నారు. వీరికి మెనూ ప్రకారం రోజూ అన్నం, ఆకుకూర, కూరగాయలతో పప్పు, కోడిగుడ్డు, 200 మిల్లీ లీటర్ల పాలు అందజేస్తున్నారు. పిల్లలకు అన్నం, పప్పు, కోడి గుడ్డుతో పాటు 100 మిల్లీ లీటర్ల పాలు ఇస్తున్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్..


వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ కిట్ అందజేస్తున్న కౌన్సిలర్ శ్రీనివాసరావు

నియోజకవర్గంలోని అంగన్వాడీ కేంద్రాలు, గర్భిణులు, బాలింతలు

మండలం	అంగన్వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	(0–6) చిన్నారులు
సత్తెనపల్లి టౌన్	43	263	283	4,935
సత్తెనపల్లి రూరల్	76	315	380	5,728
ముప్పాళ్ళ	45	209	226	2,129
రాజుపాలెం	65	321	345	3,123
నకరికల్లు	74	427	468	4,420
మొత్తం	**303**	**1,535**	**1,702**	**20,335**

గర్భిణులకు, బాలింతలకు మధ్యాహ్న భోజనంతో పాటు ఇంటి వద్దకే వైస్సార్ సంపూర్ణ పోషణ కిట్ ప్రభుత్వం అందజేస్తోంది. ఇందులో రాగి పిండి, జొన్న పిండి, అటుకులు కిలో లెక్కన.. 250 గ్రాముల లెక్కన బెల్లం, వేరు శనగ చిక్కీలు, ఎండు ఖర్జూరం ఉంటాయి. ఈ కిట్టు నెలకోసారి అందజేస్తారు.

వైద్య సేవలు, అవగాహన

అంగన్‌వాడీ కేంద్రంలో నెలకోసారి ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో గర్భిణులకు, బాలింతలకు వైద్య సేవలు అందిస్తున్నారు. రక్త హీనత ఉన్న వారిని గుర్తించి, ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందేలా చూస్తున్నారు. బిడ్డ సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండేందుకు పౌష్టికాహారం అందజేస్తుండటంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక ఎప్పటికప్పుడు అవగాహన కల్పించేందుకు ర్యాలీలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం పట్టణంలోని 19వ వార్డు సుందరయ్య కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు ప్రారంభించారు. కిట్టు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం లక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్త స్వాతి, ఆశ వర్కర్ శైలజ, ఆయా కుమారి పాల్గొన్నారు. అలాగే సత్తెనపల్లి మండలం కొమెరపూడి, గుడిపూడి గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి వైఎస్సార్ పోషణ కిట్ పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే..ఆరోగ్యం

బెల్లంకొండ: పోషకాహారం తీసుకోవడం ద్వారానే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి కోటేశ్వరరావు పేర్కొన్నారు. చంద్రాజుపాలెంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ ఇమాంబీ, సీహెచ్‌ఓ మణికుమారి, ఎంపీహెచ్‌ఈఓ శికా శ్యాంసన్, రాణి, శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు బాషా, ఫ్లోరెన్స్, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, కార్యకర్తలు విజయకుమారి, శోభారాణి, మల్లేశ్వరి పాల్గొన్నారు.


పోషణ పక్వాడ ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పోషణ కిట్లు సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం అమలు చేస్తోంది. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో మెనూ ప్రకారం భోజనం వడ్డించేలా చర్యలు తీసుకుంటున్నాం. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలపై బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నాం. అలాగే వారు సంపూర్ణ పోషణ కిట్‌ను సద్వినియోగం చేసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు.

–టి.శ్రీలత, సీడీపీఓ, సత్తెనపల్లి.

పరీక్ష సామగ్రి పంపిణీ



పెదకూరపాడు: గారపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని హుస్నేన్ నగరానికి చెందిన మాగులూరి ఫౌండేషన్ అధినేత మాగులూరి భానుప్రకాశ్ శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుంచనపల్లి కిరణ్‌కుమార్, కొండవీటి ప్రసాద్ తదితరలు పాల్గొన్నారు.

గిన్నెలు, బిస్కెట్లు పంపిణీ



దమ్మాలపాడు(ముప్పాళ్ళ): సినీ నటుడు రామ్‌చరణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా దమ్మాలపాడు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు గిన్నెలు, బిస్కెట్లు, పండ్లు శనివారం పంపిణీ చేశారు. పల్నాడు జిల్లా రామ్‌చరణ్ యువశక్తి జిల్లా అధ్యక్షుడు శిరిగిరి నరేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు గిన్నెలను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామ్‌చరణ్ అభిమాన సంఘం నాయకులు శ్రీగిరి పవన్‌కుమార్, శిరిగిరి సురేష్, పోతన రావు, నాగ గోపీ, సువారపు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తులు లేని పారదర్శక పాలన

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం: మధ్యవర్తులు లేకుండా సంక్షేమ పథకాలను పారదర్శకంగా ప్రజలకు నేరుగా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. కోటనెమలిపురిలో ఐదు గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు శనివారం శిక్షణ తరగతులు మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు పాల్గొని, మాట్లాడారు. అన్ని వర్గాలకు పథకాలు అందిస్తున్నామని, కొంత మంది కావాలనే పథకాలు అందినా..అందడం లేదని చెబుతున్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనిని ప్రజల్లోకి తీసుకెళ్లేలా సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు సంయుక్తంగా కృషి చేయాలని ఆయన సూచించారు. మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత, వైస్ ఎంపీపీ హరి సూరమ్మ, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ పులిబండ్ల అశోక్, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, మాజీ ఏబీ సొసైటీ అధ్యక్షుడు తోట లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ నాగేశ్వరరావు, సర్పంచ్‌లు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కొర్రకూటి వెంకాయమ్మ, దేవిరెడ్డి లక్ష్మీరెడ్డి, కార్పొరేటర్ అచ్యుత శివప్రసాద్, వెన్నా సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


శిక్షణ తరగతిలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు

నేడు సత్తెనపల్లి ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

పెదకూరపాడు: పెదకూరపాడు గ్రామంలోని అంబేడ్కర్ బొమ్మ వద్ద ఆదివారం ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావుకు అభినందన సభ నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ దళిత సంఘ నాయకులు శనివారం ఒక ప్రటకలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, క్రోసూరు ఎంపీపీ పెరుమాళ్లపల్లి కోటయ్య, జెడ్పీటీసీ కకణాల స్వర్ణకుమారి, వైస్ చైర్మన్ గార్లపాటి దాసు చిలకా చంద్రయ్య, ఏకుల చిన్న కోటయ్య, షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ చాంద్ బాషా పాల్గొంటారని పేర్కొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

మూడవ రోజు పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే నంబూరు

బెల్లంకొండ: కందిపాడు గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి తిరునాళ్ల సందర్భంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు మూడు రోజులుగా హోరాహోరీగా సాగుతున్నాయి. మూడవ రోజు జరుగుతున్న జాక్ పాట్ ఎడ్ల పోటీలను శనివారం సాయంత్రం పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని, రైతుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారని తెలిపారు. సీనియర్, ఆరుపళ్ల సైజు ఎడ్లకు పోటీలు నిర్వహించినట్లు పోటీల నిర్వాహకులు పేర్కొన్నారు. మొత్తం 8 జతలు పోటీల్లో పాల్గొనేందుకు వచ్చాయన్నారు. గెలుపొందిన ఎడ్ల యజమానులకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, మండల పార్టీ నాయకులు చింతారెడ్డి సాయిరెడ్డి, సర్పంచ్ కంభంపాటి పాప, ప్రకాష్, ఎంపీటీసీ రేగులగడ్డ తిరుపతమ్మ, శ్రీనివాసరావు, మర్రి చంద్రారెడ్డి, మర్రి ప్రసాదరెడ్డి, వైస్ ఎంపీపీ బూదాటి మరియదాసు, సొసైటీ ప్రెసిడెంట్ భద్రయ్య పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, నాయకులు

విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

దొడ్లేరు(క్రోసూరు): విద్యకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. దొడ్లేరు గ్రామంలో విజ్ఞాన్ పాఠశాల 30 వ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 30 ఏళ్లుగా పాఠశాలను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ షేక్ మస్తాన్‌వలి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు

సేవకు ప్రతిరూపం దివ్వెల

సత్తెనపల్లి: సేవకు ప్రతిరూపం దివ్వెల శ్రీనివాసరావు అని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారూరీ లింగారెడ్డి కొనియాడారు. భరతమాత అన్నప్రసాద వితరణ పథకం ద్వారా 500 రోజులు నిరు పేదలకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేసిన సందర్భంగా శనివారం న్యాయవాది చలువాది చిన్న సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని న్యాయవాద కార్యాలయంలో న్యాయవాది బీఎల్ చిన్నయ్య దివ్వెలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పీవీ నరసింహశాస్త్రి, పీసీహెచ్ వెంకట కోటయ్య, కాకర్ల నాగ హరిబాబు, గంగూరి అజయ్ కుమార్, జి.మార్కురావు, నరిశెట్టి వేణు గోపాలారావు, ఆర్యవైశ్య నాయకులు కొర్రప్రోలు బదరి నారాయణ, నెర్లె శంకరరావు, రాంబాబు పాల్గొన్నారు.


దివ్వెలను సత్కరిస్తున్న లింగారెడ్డి, న్యాయవాదులు

పల్లెలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- ఫ్యాక్షన్ గ్రామాల్లో ప్రజలతో మమేకమై ప్రత్యేక సమావేశాలు
- సత్తెనపల్లి డివిజన్ పరిధిలో 10 గ్రామాల్లో పోలీసుల పల్లెనిద్ర

సత్తెనపల్లి: ప్రజలకు అన్ని విధాలా రక్షణ కల్పించేది పోలీస్ వ్యవస్థ. పల్లె ప్రజలు ప్రశాంతంగా జీవించాలని, గతంలో తెలిసో, తెలియకో ఏదైనా నేరాలకు పాల్పడితే అలాంటి వారందరూ నేర ప్రవృత్తి వీడాలని.. తీరు మార్చుకోకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరికలు చేస్తున్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు సత్తెనపల్లి సబ్ డివిజన్‌లోని 10 గ్రామాల్లో శనివారం రాత్రి డీఎస్పీ బి.ఆదినారాయణ నేతృత్వంలో పోలీసులు పల్లెనిద్ర చేపట్టారు. సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ, అమరావతి ఎస్ఐ పి.కోటేశ్వరరావు అమరావతి మండలం నరుకుళ్ళపాడు.. సత్తెనపల్లి రూరల్ సీఐ రామిశెట్టి ఉమేష్, నకరికల్లు ఎస్ఐ పి.సురేష్ నకరికల్లు మండలం రూపెన గుంట్ల.. సత్తెనపల్లి టౌన్ సీఐ యు.శోభన్‌బాబు సత్తెనపల్లిలోని నాగన్నకుంట.. పెదకూరపాడు సీఐ కె.వీరాస్వామి, ఎస్ఐలు బీవీ.క్రిష్టారావు, ఎం.సత్యనారాయణ పెదకూరపాడులోని లింగంగుంట్ల.. అచ్చంపేట ఎస్ఐ కె.పాల్ రవీంద్ర అచ్చంపేటలోని వేల్పూరు.. క్రోసూరు ఎస్ఐ సీహెచ్ మణిక్రిష్ణ క్రోసూరులోని దొడ్లేరు.. సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ అవుల బాలక్రిష్ణ సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు.. రాజుపాలెం ఎస్ఐ ఎం.నారాయణ మండలంలోని బలిజేపల్లి.. ముప్పాళ్ళ ఎస్ఐ ఎం.పట్టాభిరామయ్య మండలంలోని నార్నెపాడు గ్రామాల్లో పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఆయా గ్రామాల్లోని ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చట్టాలపై అవగాహన కల్పించారు. డీఎస్పీ నుంచి ఎస్ఐల వరకు అందరూ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తరచూ గొడవలు, గతంలో ఫ్యాక్షన్ కి పేరొందిన గ్రామాల్లో పోలీసులు పల్లెనిద్ర చేయడంతో అక్కడి పరిస్థితులను ఇట్టే పసిగట్టనున్నారు. శాంతి భద్రతలకు, ప్రజా జీవనానికి భంగం కలిగించే చురుకైన వ్యక్తులు, వారి కదలికల పై నిఘా వేయడంతో పాటు గ్రామంలోకి వచ్చే కొత్త వ్యక్తుల సమాచారం తెలుసుకోనున్నారు. పాత నేరస్తులను గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తూ తీరు మార్చుకోవాలని లేక పోతే రౌడీషీట్లు, పీడీ యాక్టులు ప్రయోగించాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఉన్నారు.


లక్కరాజుగార్లపాడులో ప్రజలతో సీఐ ఉమేష్, ఎస్ఐ బాలక్రిష్ణ

నార్నెపాడులో పోలీస్ పల్లె నిద్ర

నార్నెపాడు(ముప్పాళ్ళ): నార్నెపాడు గ్రామంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో పల్లె నిద్ర కార్యక్రమం శనివారం జరిగింది. సత్తెనపల్లి రూరల్ సీఐ ఆర్.ఉమేష్ పాల్గొని గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో సమస్యలుంటే పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎస్సై ఎం.పట్టాభిరామయ్య మాట్లాడుతూ వర్గ విభేదాలకు స్వస్తి చెప్పాలని కోరారు. పంచాయతీ కార్యాలయంలో ఎస్సై పట్టాభిరామయ్య నిద్రించారు. ఏఎస్ఐఎస్కే ఇమామ్ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

క్రోసూరు: జాతీయ ప్రతిభా అన్వేషణ స్కాలర్‌షిప్‌కు జరిగిన పరీక్షలో హసనాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం సిస్టర్ బి.విజయకుమారి శనివారం తెలిపారు. విద్యార్థులు కె.వెంకట సుధ, గడ్డం వెంకట్రామయ్య, షేక్ జుబేదా, మాతంగి సౌజన్య, షేక్ ఆస్మ, మర్రి నరసింహస్వామి ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. మూడేళ్లుగా తమ పాఠశాల నుంచి ఎన్ఎంఎంఎస్‌కు 18 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాల స్థల దాత డాక్టర్ చింతలపాటి శూలపాణి, విద్యా కమిటీ చైర్మన్ కందిపాటి షేక్ మస్తాన్, సర్పంచ్ షేక్ రహిమాన్, ఉప సర్పంచ్ వీరయ్య ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. అలాగే స్థానిక మోడల్ స్కూల్ నుంచి ఎన్ఎంఎంఎస్‌కు ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్స్‌పల్ పి.శౌరిరాజు తెలిపారు. భువనచంద్ర, పెద్దాపురం వీరాంజనేయులు ఎంపికైనట్లు తెలిపారు.

అసత్య ఆరోపణలు సహించేది లేదు..

అమరావతి: ఇసుక దోపిడీని అడ్డుకున్నందుకే ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై దండా నాగేంద్ర అనే వ్యక్తి అసత్య ఆరోపణలు చేస్తున్నాడని జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కోట హరిబాబు ఆరోపించారు. గుంటూరులోని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీలోకి చేరేటప్పుడు అమరావతి మండలం ధరణికోటకు చెందిన దండా నాగేంద్ర ఆర్థిక పరిస్థితి ఎంటో నియోజకవర్గంలో అందరికీ తెలుసునన్నారు. ఎమ్మెల్యే శంకరరావు పైన ఆయన కుటుంబ సభ్యులపైన తప్పుడు ఆరోపణలు చేస్తే వైఎస్సార్ సీపీ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని స్పష్టం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మంగిశెట్టి కోటేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో చేరక ముందు ఎటువంటి ఆస్తులు లేని దండా నాగేంద్ర నేడు కోట్ల రూపాయలతో ఫాం హౌస్‌లు, సుమారు 30 భారీ లారీలు ఎలా కొన్నాడో చెప్పాలన్నారు. అక్రమ మార్గాలలో డబ్బు సంపాదించేందుకు ఎమ్మెల్యే శంకరరావు ఒప్పుకోకపోవటంతో ఆయన కుటుంబ సభ్యులపై తీవ్ర ఆరోపణలు చేయటం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నర్సరావుపేట పార్లమెంట్ నియోజవర్గ అధికార ప్రతినిధి నంబూరు కరుణ కుమార్ మాట్లాడుతూ ఎన్‌జీటీ కేసు వేసే సమయంలో తాను ప్రత్యక్ష సాక్షిగా ఉన్నానని, అనాడు ఎమ్మెల్యే శంకరరావుకు తెలియకుండా కేసు పెట్టిన తర్వాత, మందలించి అతని చేత ఎమ్మెల్యే శంకరరావు కేసు ఉప సంహారణ చేయించటం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆరోపణలు అన్ని వాస్తవాలైతే.. అమరావతి అమరేశ్వరస్వామి ముందు ప్రమాణం చేయటానికి సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు భవిరిశెట్టి హను మంతరావు, అళ్ల శ్రీనివాసరెడ్డి, నాయుడు రాంబాబు, అలా లక్ష్మీనారాయణ, చిలకా సాంబయ్య, కంకణాల శివాజీ, షేక్ సుభాని, వాసు, కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అచ్చంపేట: ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై అర్థంపర్థం లేని ఆరోపణలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ నాయకులు హెచ్చరించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. అమరావతి మండలానికి చెందిన దండా నాగేంద్ర తన అవినీతి, నీతిమాలిన చర్యలు బహిర్గతం అవడంతో ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే పేరు చెప్పుకుని రాజకీయంగా ఎదిగి, ఎవరో మెప్పు కోసం తనకు ప్రాణహాని పొంచి ఉందంటూ పచ్చ మీడియాలో అక్కసు వెళ్లగక్కడం నీచమన్నారు. జెడ్పీటీసీ తుమ్మా విజయ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్లుగా నియోజకవర్గంలో జరగని అభివృద్ధి, సంక్షేమం గత మూడున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి సహకారంతో ఎమ్మెల్యే శంకరరావు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప ఎంపీపీలు గంగసాని బాబు, తెల్లమేకల నాగరాజు, సర్పంచ్ కంబాల వీరబాబు, వ్యవసాయ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, జిల్లా కార్యదర్శి సుంకర శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ టీవీఎస్ మల్లికార్జునరావు, లిడ్క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, ఉప సర్పంచ్ షేక్ జాని, బీసీ సేన అధ్యక్షుడు బీరువాల జాని, మైనార్టీ నాయకులు షేక్ కమల్ సైదా, రైతు నాయకులు తుమ్మా ఎర్రమల్రెడ్డి, రామిశెట్టి రంగయ్య పాల్గొన్నారు.